# ప్రోక్షణ

**దేవుని పరిశుద్ధ నామమునకు మహిమ కలుగును గాక !**

**ఈ రోజు క్రైస్తవ సమాజములో వివాదానికి దారితీస్తున్న అంశాలలో ఒకటి ఈ ప్రోక్షణ. ఈ అంశము మీద పెద్ద ఎత్తున చర్చలు జరగడం మనము గమనిస్తున్నాము. సేవకులు ప్రార్థన చేస్తే నీరు, నూనె యేసు రక్తముగా మారుతుంది అని నమ్మేవారు కొంతమంది, నమ్మనివారు కొంతమంది. ఈ నమ్మకాన్ని అమ్ముకునేవారు కొంతమంది , నమ్మిన వారిని హేళన చేసేవారు కొంత మంది. మరి ఇది నిజమా ? కాదా ? సేవకులు ప్రార్థిస్తే నీరు, నూనె యేసుక్రీస్తు వారి రక్తముగ మారుతుందా ? మారదా ? ఎవరు పొరబడుచున్నారు నమ్మిన వారా ? నమ్మని వారా ?**

ఎవరు పొరబడుచున్నారో వాక్యములో చూద్దాం

**మార్కు 12:24 - అందుకు యేసుమీరు లేఖనములనుగాని దేవుని శక్తిని గాని యెరుగక పోవుటవలననే పొరబడుచున్నారు.**

పై వచనము ప్రకారము లేఖనాలని యెరుగని వారు పొరబడుతారు అని మనకు అర్థం అవుతుంది . ఈ రోజుల్లో క్రైస్తవ సంఘాలలోని చాలా వివాదాలకి ఇదే కారణ. వాక్యాన్ని సరిగా ధ్యానించకపోవడం .అందుకే వాక్యపు వెలుగులో ఒక క్రమమును పాటిస్తున్నాము. ప్రతి లెంటు లో అందరూ మోకాళ్లమీద బైబిల్ మొత్తం చదవాలి మరియు వ్రాయడానికి ప్రయత్నించాలి . **అందుకే దావీదు భక్తుడు దివారాత్రము దానిని (వాక్యము) ధ్యానించువాడు ధన్యుడు అని చెప్తున్నాడు (కీర్తన 1:2)**

మరి ప్రోక్షణ గురించి లేఖనాలు ఏమి చెప్తున్నాయో ధ్యానిద్దాం. పరిశుద్ధ గ్రంధములో దేవుడు పాపము వలన అంటిన అపవిత్రతను తీసివేయడానికి కొన్ని పద్ధతులు ప్రవేశపెట్టినాడు. అవి ఏవనగా

**1.శుద్ధ జలము ప్రోక్షించుట , 2.రక్తము ప్రోక్షించుట, 3. బూడిద ప్రోక్షించుట**

1) **శుద్ధ జల ప్రోక్షణ- యెహెజ్కేలు 36:25 - మీ అపవిత్రత యావత్తు పోవునట్లు నేను మీ మీద శుద్ధజలము చల్లుదును, మీ విగ్రహములవలన మీకు కలిగిన అపవిత్రత అంతయు తీసివేసెదను.**

యెహోవా దేవుడు పరిశుద్ధుడు , ఆయన బిడ్డలమైన మనకు అపవిత్రత అంటడము ఆయనకు ఇష్టము లేదు అందుకే శుద్ధజలమును ప్రోక్షించి మనకు కలిగిన అపవిత్రత తీసివేస్తున్నాడు . మన అపవిత్రత యావత్తు పోవాలంటే శుద్ధ జల ప్రోక్షణ అవసరం అని మంకు స్పష్టముగా అర్ధము అవుతుంది అంతే కాక శుద్ధజల ప్రోక్షణ ద్వార మన జీవితములో ఒక మార్పు తీసుకువస్తున్నాడు . ఆ మార్పు ఏమిటో ఈ క్రింద గమనించవచ్చు .

**నూతన హృదయము** మీ కిచ్చెదను, **నూతన స్వభావము** మీకు కలుగజేసెదను, **రాతిగుండె** మీలోనుండి తీసివేసి **మాంసపు గుండెను** మీకిచ్చెదను. **నా ఆత్మను** మీయందుంచి, **నా కట్టడల** ననుసరించువారినిగాను **నా విధులను**

గైకొను వారినిగాను మిమ్ము్మను చేసెదను. నేను మీ **పితరుల కిచ్చిన దేశము**లో మీరు నివసించెదరు, మీరు **నా జనులై** యుందురు **నేను మీ దేవుడనై యుందును**.

**మీ సకల మైన అపవిత్రతను పోగొట్టి నేను మిమ్ము్మను రక్షింతును, మీకు కరవురానియ్యక ధాన్యమునకు ఆజ్ఞ ఇచ్చి అభివృద్ధి పరతును. అన్యజనులలో కరవును గూర్చిన నింద మీరిక నొందకయుండునట్లు చెట్ల ఫలములను భూమిపంటను నేను విస్తరింపజేసెదను. అప్పుడు మీరు మీ దుష్ ప్రవర్తనను మీరు చేసిన దుష్ క్రియలను మనస్సునకు తెచ్చుకొని, మీ దోషములను బట్టియు హేయక్రియ లను బట్టియు మిమ్ము్మను మీరు అసహ్యించుకొందురు.**

**పాపపరిహారార్ధజలము - సంఖ్యాకాండము 8:7 - వారిని పవిత్రపరచుటకు నీవు వారికి చేయవలసినదేమనగా, వారిమీద పాపపరిహారార్థ జలమును ప్రోక్షింపుము.**

పాపపరిహారార్ధజలము ప్రోక్షణ ద్వార పవిత్ర పరచుట మనము చూస్తున్నాము . లేవీయులను పవిత్ర పరచడానికి దేవుడు వారి మీద పాపపరిహారార్ధ జలము ప్రోక్షించమని చెప్తున్నాడు. మనము లేవీయులము అని గుర్తు చేసుకోవాలి

**సంఖ్యాకాండము 19:13** - నరశవమును ముట్టినవాడు అట్లు పాపశుద్ధి చేసికొననియెడల వాడు యెహోవా మందిరమును అపవిత్రపరచువాడగును. ఆ మనుష్యుడు ఇశ్రాయేలీయులలోనుండి కొట్టివేయబడును.**పాపపరిహార జలము వానిమీద ప్రోక్షింపబడలేదు గనుక వాడు అపవిత్రుడు, వాని అపవిత్రత యింక వాని కుండును.**

**నరశవమును ముట్టిన వాడు పాపి, అపవిత్రుడు అని చెప్పుట మనము గమనించవచ్చు. పాపపరిహారార్ధ జలము ప్రోక్షించబడే వరకు వాడి అపవిత్రత పోదు అని వాక్యము హెచ్చరిస్తుంది**

**అంతేకాక 1) మందిరమునకు రాకూడదు (అపవిత్రుడు పవిత్ర స్థలములో ప్రవేశించకూడదు )**

**2) ఇశ్రాయేలీయులలోనుండి కొట్టివేయబడును**

**ఎవరు ప్రోక్షించాలి - దినవృత్తాంతములు రెండవ గ్రంథము 35:11 - లేవీయులు పస్కాపశువులను వధించి రక్తమును యాజకుల కియ్యగా వారు దాని ప్రోక్షించిరి.లేవీయులు పస్కాపశువులను వధించినప్పుడు వచ్చిన రక్తమును యాజకులకియ్యాలి .ఇది వారి కట్టడ (Duty).**
**యాజకులు దానిని ప్రోక్షించాలి అని మనకు అర్ధము అవుతుంది .**

**ఎవరు ప్రోక్షించకూడదు: పరిశుద్ధత, పరిశుద్ధాత్మ లేకుండా ఆత్మ కార్యముల పరిజ్ఞానము లేని వారు ప్రోక్షింపకూడదు. దయ్యములు ప్రాలదోలె ప్రయత్నములు చేయకూడదు. అలా చేస్తే వారు ఇబ్బంది పడే అవకాశము వుంది.**

**ఉదా: స్కెవకుమారులు అపో" కా: 19:13,14,16 – అప్పుడు దేశసంచారులును మాంత్రికులునైన కొందరు యూదులు-పౌలు ప్రకటించు యేసు తోడు మిమ్ము్మను ఉచ్చాటన (మంత్రించుట) చేయుచున్నానను మాట చెప్పి , దెయ్యములు పట్టిన**

**వారిమీద ప్రభువైన యేసు నామమును ఉచ్చరించుటకు పూనుకొనిరి. యూదుడైన స్కెవయను ప్రధానయాజకుని కుమారులు 7గురు ఆలాగున చేయుచుండిరి.**

**అపో"కా: 19:15 – అందుకు ఆ దయ్యము నేను యేసును గుర్తెరుగుదును , పౌలునుకూడా ఎరుగుదును, గాని మీరెవరు అని అడుగగా.**

**అపో" కా: 19:16 – ఆ దెయ్యము పట్టిన వాడు ఎగిరి వారిమీద పడి, వారిలో ఇద్దరినీ లొంగదీసి గెలిచెను; అందుచేత వారు దిగంబరులై గాయము తగిలి ఆ యింటనుండి పారిపోయిరి.**

**పైన మనము గమనించినట్లయితే ప్రధాన యాజకుడైన స్కెవ కుమారులు తండ్రి తరువాత ప్రదానయాజకులుగా అభిషేకించ బడవలసిన వారు. అందుకు తగిన సిద్దపాటు, పరిశుద్దత, పరిశుద్దాత్మ అభిషేకము పొందుకొనుటకు బదులుగా ప్రదానయాజకుని కుమారులమ అన్న అహంకార స్వభావముతో దెయ్యములు విడిపించే ప్రయత్నము చేసారు.   కాని దెయ్యముచేత గాయాల పాలై,దిగంబరులై పరిగెత్తినారు. దెయ్యము వారిని గెలిచి లొంగదీసుకుంది. దయ్యము చెప్పిన మాటను మనము బాగా గమనించాలి . దయ్యము స్పష్టముగా యేసుక్రీస్తు, పౌలు తెలుసు అని ఒప్పుకుంది కాని స్కెవ కుమారులలో యేసుక్రీస్తు లేరు గనుక వారు దయ్యము చేతిలో దెబ్బలు తిన్నారు మనము కూడా క్రైస్తవులు అని చెప్పుకుంటూ క్రీస్తుని కలిగి ఉండకపోతే నాడు స్కెవ కుమారులకు ఎదురైన అనుభవము మనకు కూడా తప్పకుండ ఎదురవుతుంది.  నాటి స్కెవ వలె నేడు కూడా  ప్రపంచములో  సేవకులు వారిపిల్లలను పరిశుద్దతలో పెంచడము లేదు. దేవుని భయముభక్తి నేర్పించడం లేదు. పిల్లలు కూడా మేము దేవుని సేవ చేయవలసిన పిల్లలము అన్న సంగతి మరచి లోకముతో కలిసిపోయి లోకస్తులుగా ప్రవర్తిస్తున్నారు. సేవకులు మరియు సేవకుల పిల్లలు ఈ విషయములో సరిదిద్దుకోవలసిన అవసరము ఎంతో వుంది.**

2) **రక్త ప్రోక్షణ -నిర్గమకాండము 24:8 - అప్పుడు మోషే రక్తమును తీసికొని ప్రజలమీద ప్రోక్షించి ఇదిగో యీ సంగతులన్నిటి విషయమై యెహోవా మీతో చేసిన నిబంధన రక్తము ఇదే అని చెప్పెను.** మోషే నిబంధన గ్రంథమును వినిపించిన తరువాత ప్రజలు యెహోవా చెప్పినట్టు చేస్తాము అనిరి. అప్పుడు మోషే రక్తాన్ని ప్రోక్షించినాడు . ప్రజలకు ,దేవునికి మధ్య నిభందనను యాజకులు రక్తాన్ని ప్రోక్షించి స్థిరపరచాలి .

**చాలా మంది పాతనిబంధన కాదు క్రొత్తనిబంధనలో వుంటే చెప్పమంటారు .అయితే క్రొత్తనిబంధనలో కూడా దేవుడు స్పష్టముగా వివరించినాడ .**

**హెబ్రీయులకు 9:11-21 -** అయితే క్రీస్తు రాబోవుచున్న మేలులవిషయమై ప్రధానయాజకుడుగా వచ్చి తానే నిత్యమైన విమోచన సంపాదించి, హస్తకృతము కానిది, అనగా ఈ సృష్టి సంబంధము కానిదియు, మరి ఘనమైనదియు,  మేకలయొక్కయు కోడెలయొక్కయు రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధస్థలములో




ప్రవేశించెను. ఏలయనగా మేకలయొక్కయు, ఎడ్లయొక్కయు రక్తమును, **మైలపడిన వారిమీద ఆవుదూడ బూడిదె చల్లుటయు**, శరీరశుద్ధి కలుగునట్లు వారిని పరిశుద్ధపరచిన యెడల, నిత్యుడగు ఆత్మద్వారా తన్ను తాను దేవునికి

నిర్దోషినిగా అర్పించు కొనిన క్రీస్తుయొక్క రక్తము, నిర్జీవక్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు **మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధిచేయును.** ఈ హేతువుచేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధములనుండి విమోచనము కలుగుటకై ఆయన మరణము పొందినందున పిలువబడిన వారు నిత్యమైన స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానమును పొందు నిమిత్తము ఆయన క్రొత్తనిబంధనకు మధ్యవర్తియై యున్నాడు. మరణశాసనమెక్కడ ఉండునో అక్కడ మరణశాసనము వ్రాసినవాని మరణము అవశ్యము. ఆ శాసనమును వ్రాసినవాడు మరణము పొందితేనే అదిచెల్లును; అది వ్రాసినవాడు జీవించుచుండగా అది ఎప్పుడైనను చెల్లునా? ఇందుచేత **మొదటి నిబంధనకూడ రక్తములేకుండ ప్రతిష్ఠింపబడలేదు.**

ధర్మశాస్త్రము ప్రకారము మోషే ప్రతి యాజ్ఞను ప్రజలతో చెప్పిన తరువాత, ఆయన నీళ్లతోను, రక్తవర్ణముగల గొర్రె బొచ్చుతోను, హిస్సోపుతోను, కోడెలయొక్కయు మేకలయొక్కయు రక్తమును తీసికొని దేవుడు మీకొరకు విధించిన నిబంధన రక్తమిదే అని చెప్పుచు, గ్రంథముమీదను ప్రజలందరి మీదను ప్రోక్షించెను. మరియు **ధర్మశాస్త్ర ప్రకారము సమస్త వస్తువులును రక్తముచేత శుద్ధిచేయబడుననియు, రక్తము చిందింపకుండ పాప క్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును. అదేవిధముగా గుడారముమీదను** సేవాపాత్రలన్నిటి మీదను ఆ రక్తమును ప్రోక్షించెను

ఇక్కడ మనము ఒక విషయము గమనించాలి . రక్తము, మనుష్యులు అందరితో పాటు గుడారము మీదను సేవా పాత్రలన్నిటిమీదను ప్రోక్షించుట మనము చూస్తున్నాము అనగా అపవిత్రత అనేది మనుష్యులతో పాటు గుడారములకు, సేవాపాత్రలకు కూడా అంటుతుంది అని మనం అర్థం చేసుకోవాలి.

**ఉదాహరణ :** మనము మన ఇంటిలోని ప్లేట్ ఎవరికైనా విగ్రహారాధికులకు ఇచ్చాము అనుకుందాము వారు మన ప్లేట్ ని విగ్రహ సంబంధమైన పూజ లో వాడారు అనుకుందాము ఇప్పుడు దానికి అపవిత్రత అంటుతుంది .ఇప్పుడు**ఆ పాత్రకి (ప్లేట్ ) ఏమి చేస్తే అపవిత్రత పోతుంది ? మన దగ్గర వున్న మంచి (Best dish wash bar) సోప్ తో కడిగితే పోతుందా ? అది మరింత శుభ్రముగా రావచ్చు గాని దానికి అంటిన అపవిత్రత పోదు . కేవలము రక్త ప్రోక్షణ ద్వారా మాత్రమే పోతుంది .**

**అందుకే సేవకులు ప్రార్థించి నీటిని గాని ,నూనెను గాని ఇల్లంతటిలో ప్రోక్షిస్తారు. ఇది దేవుని క్రమము.**

**హెబ్రీయులకు 12:24 -క్రొత్తనిబంధనకు మధ్య వర్తియైన యేసునొద్దకును హేబెలుకంటె మరి శ్రేష్ఠముగ పలుకు ప్రోక్షణ రక్తమునకును మీరు వచ్చియున్నారు.**

పరిశుద్ధగ్రంథములో **హేబెలు(యేసు క్రీస్తు వారికి ముంగుర్తు )** కి ఒక ప్రత్యేకత వుంది . హేబెలు గొర్రెల కాపరి, హేబెలు తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను.**యెహోవా హేబెలును అతని యర్పణను**

**లక్ష్య పెట్టెను; హేబెలు నీతిమంతుడు.** దేవునికి మొట్ట మొదట శ్రేష్టమైన అర్పణ అర్పించిన వానిగా మనము గమనించవచ్చు.

**నీ తమ్ముని రక్తము యొక్క స్వరము నేలలోనుండి నాకు మొరపెట్టుచున్నది – ఆది 4:10.** రక్తానికి ప్రాణం వుందని, అది మాట్లాడుతుందని మనము అర్ధము చేసుకోవచ్చు ( **blood can speak** ). హేబెలు రక్తము కంటే శ్రేష్టమైన రక్తము యేసుక్రీస్తు వారి రక్తము. ఆయన రక్తము మాట్లాడుతుంది, **అయన రక్తము ఎవరిమీద ప్రోక్షించ బడుతుందో వారికి కలిగిన స్వస్థత ద్వారా మాట్లాడుతుంది, అద్భుతము ద్వారా, ఆశ్చర్యకార్యముల ద్వారా మాట్లాడుతుంది, విజయము ద్వారా మాట్లాడుతుంది.**

**మనము యేసుక్రీస్తు రక్తమువలన ప్రోక్షింపబడుటకు ఏర్పరచబడిన వారము**

**1 పేతురు 1:2 - ఆత్మవలని పరిశుద్ధత పొందినవారై విధేయులగుటకును, యేసుక్రీస్తు రక్తమువలన ప్రోక్షింపబడుటకును ఏర్పరచబడినవారికి.** మనము అందరము **యేసుక్రీస్తు రక్తమువలన ప్రోక్షింపబడుటకును ఏర్పరచబడినవారము** అని మనకు స్పష్టముగా అర్ధం అవుతుంది.

**1 యోహాను 5:5 -9 యేసు దేవుని కుమారుడని నమ్ము వాడు తప్ప లోకమును జయించువాడు మరి ఎవడు? నీళ్లద్వారాను రక్తముద్వారాను వచ్చిన వాడు ఈయనే, అనగా యేసుక్రీస్తే. ఈయన నీళ్లతో మాత్రమేగాక నీళ్లతోను రక్తముతోను వచ్చెను. ఆత్మ సత్యము గనుక సాక్ష్యమిచ్చువాడు ఆత్మయే. సాక్ష్య మిచ్చువారు ముగ్గురు, అనగా ఆత్మయు, నీళ్లును,రక్తమును, ఈ ముగ్గురు ఏకీభవించి యున్నారు.**

**మనము మనుష్యుల సాక్ష్యము అంగీకరించుచున్నాము గదా! దేవుని సాక్ష్యము మరి బలమైనది. దేవుని సాక్ష్యము ఆయన తన కుమారుని గూర్చి యిచ్చినదే. ఎవరైతే రక్త ప్రోక్షణ క్రిందికి వస్తారో వారి మీద సాక్ష్యమిచ్చు వారు ముగ్గురు, అనగా ఆత్మయు, నీళ్లును,రక్తమును, ఈ ముగ్గురు ఏకీభవించి యున్నారు ఆయనే క్రీస్తు** . దాదాపు 2000 సంవత్సరాల క్రితము సిలువ మీద ఆయన రక్తాన్ని కార్చితే ఇప్పటి వారికి ఆ ప్రోక్షణ ఎలా జరుగుతుంది అంటే**దేవుడు తన యాజకులకు ఒక అధికృతను ఇచ్చాడు వారు నీళ్ళకు, నూనెకు ప్రార్ధన చేసి ఇస్తే అది ఆయన రక్తముగా మారే కృపను ఇచ్చాడు.** దానిని ఆలాగున నమ్మిన వారికి అనేక కార్యములు ,అద్భుతములు ,ఆశ్చర్యములు చేసినారు, చేస్తున్నారు, చేస్తూవుంటారు..................అందుకే ఆయన **అద్భుతకరుడు, ఆశ్చర్యకరుడు**.

**నమ్మువానికి సమస్తము సాధ్యము అని లేఖనాలు సెలవిస్తున్నాయి. తోమా యేసుక్రీస్తు గాయాలను చూచి గాని నమ్మలేదు. ప్రస్తుత కాలములో తోమా వంటివారు అనేకులు మన మధ్య వున్నారు.అయన రక్తాన్ని నమ్మకపోతే ఆయనను ఎలా నమ్మగలము.** మనమందరము యేసుక్రీస్తు రక్తప్రోక్షణ కొరకు ఏర్పరచబడిన వారము. రక్తప్రోక్షణ నమ్మని వారు ఏర్పరచబడినవారు కారు.